Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 234 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :234 | గురువారం 21 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4



## విశాఖ ఉక్కుపై కుట్ర
# తగదు చంద్రబాబు

### రాష్ట్రం లో పరిపాలన పూర్తిగా గాలికి వదిలేశారు
### ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదు
### సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయనగరం**

విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తుంటే సీఎం చంద్రబాబు ఏం చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. చంద్రబాబు పాలనపై బొత్స సత్యనారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం లో పరిపాలన పూర్తి గా గాలికి వదిలేశారు. ఏ ఒక్క వర్గం సంతృప్తి గా లేదు. సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు. తల్లికి వందనం పథకంలో ఏడు ఎనిమిది లక్షల మందికి కేంద్రం నుండి డబ్బులు రాలేదని అరకొరగా ఇచ్చారు. అన్న దాత సుఖీభవ అర్హులకు ఇవ్వలేదు. సాంకేతిక కారణం చెప్పి ఎగ్గొట్టారు.వితంతు పెన్షన్స్ ఇవ్వకుండా కారణాలు చెప్తున్నారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్స్ - మిగతా3లో

# ఇంటికో పారిశ్రామిక వేత్త

- స్టార్టప్ లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- అమరావతితో పాటు ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లకు గిన్నిస్ వరల్డ్ రికార్డు
- టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను
- ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటీకీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**


'ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త రావాల నేదే నా నినాదం. ఈ లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు పనిచేస్తాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నో వేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..'రతన్ టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ - మిగతా3లో



## రెండేళ్లలో 9లక్షల ఇళ్ల నిర్మాణం

- మంత్రులు పార్థసారథి, నారాయణ
- "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం
- ఎన్టీఆర్ హౌసింగ్ కింద గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు
- హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం
- పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు





## లోక్‌సభ ముందుకు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు

- కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్
- ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లు
- నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా

## 1971 నుంచి అదే దుర్మార్గపు ధోరణి

- ఐరాస వేదికగా పాకిస్థాన్‌పై భారత్ ఫైర్
- మహిళలపై లైంగిక హింస విషయంలో పాకిస్థాన్ సిగ్గుమాలిన రికార్డును కలిగి ఉంది
- అలాంటి దేశం మానవ హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది
- '1971లో తూర్పు పాకిస్థాన్‌లో పాక్ సైన్యం మహిళలపై జరిపిన ఘోరమైన లైంగిక నేరాలు చరిత్రలో ఒక సిగ్గుచేటు అయిన రికార్డు




# ఇళ్లులేని పేదలను గుర్తించేందుకు సర్వే

- నెల రోజుల్లో 3 లక్షల కుటుంబాలకు గృహప్రవేశాలు
- గృహ నిర్మాణ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలి
- పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిల్లు ఉం డాలని... ఇందుకోసం తలపెట్టిన గహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన ముఖ్యమంత్రి... వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. బుధవారం సచివాలయంలో గహ నిర్మాణ శాఖపై అధికారులతో సమీక్షించిన సీఎం.... రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుం బాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశిం చారు. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాల న్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, - మిగతా3లో



## 'స్త్రీ శక్తి' పథకం మహిళలకు ఆర్థిక భరోసా

- ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల్లో ఆనందం
- బస్ స్టేషన్‌లో సీఎం చంద్రబాబుకు జేజేలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంతో మహిళల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత తెలిపారు. బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ లో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై మహిళల - మిగతా3లో



## నేను అరెస్టయితే పదవికి రాజీనామా చేశా

- 30 రోజులు జైల్లో ఉంటే పదవి రద్దుపై అమిత్‌షా
- క్రిమినల్ కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లే ప్రజాప్రతినిధుల పదవులకు చెక్ పెట్టేలా బిల్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లుపై ప్రతిపక్షాల వ్యతిరేకత



## లోక్‌సభ ముందుకు కీలక బిల్లు.. శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ

- కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపై కూడా ఆయన పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా వ్యాఖ్యలు
- 'ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం
- ఇందులో నాకు ఎలాంటి తప్పు కన్పించడం లేదు

## దిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి!

'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడి

## రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకే ఆ బిల్లు

- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రాలను అస్థిర పర్చేందుకు సరికొత్త పన్నాగాలు పన్నుతున్నారు
- "ఓట్ల దొంగతనం బయటపడిన నాటినుంచి మోదీ-షా సరికొత్త ట్రిక్కుల కోసం చూస్తున్నారు
- నేడు తీసుకొస్తున్న తాజా బిల్లు రాష్ట్ర ప్రభుత్వాలను నేరుగా కూల్చే అవకాశం సీబీఐ, ఈడీకి అప్పజెబుతుంది
- తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు



## శ్రీసిటీని సందర్శించిన
# జపాన్-ఎహైమ్ రాష్ట్ర ప్రతినిధుల బృందం



**శ్రీసిటీ,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 20:**
ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ జనరల్ మేనేజర్ తకాహిరో ఇన్నామి నేతృత్వంలో జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధిబృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాలు, రంగాలవారీ వైవిధ్యం, సుస్థిర ప్రణాళిక, వ్యాపారఅనుకూలతలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ పెట్టు బడిదారుల అనుకూల విధానాలను హైలైట్ చేస్తూ వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సాహకాలు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తదితర అంశాల గురించి వెల్లడించారు.ఈ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామిక వేత్తలను సాదరంగా ఆహ్వానించారు. ఎహైమ్‌కు చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమయూనిచార్మ్ సహా 35కు పైగా జపాన్ కంపెనీల ఏర్పా టుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, జపనీస్ సంస్థలతో భాగస్వామ్యాన్ని ఇన్నామి ప్రశంసించారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ ఆటో-రిక్షాలకు వున్న మార్కెట్ డిమాండ్ దృష్ట్యా, భారత్‌లో కాలుష్యరహిత పర్యావరణ వ్యవస్థకు దోహదపడే రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేసింది.ఈ ఏడాదిలో రెండవ పర్యాయం ఎహైమ్ వ్యాపారవేత్తల బృందం శ్రీసిటీ పర్యటనకు రావడం శ్రీసిటీలో వ్యాపార నిర్వహణ పట్ల జపాన్ సంస్థల ఆసక్తిని తెలియచే యడంతో పాటు ఇండో-జపనీస్ ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

## పాఠశాలకు 70 వేల విలువగల టేబుల్స్ వితరణ




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 20:**
రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలోని అన్నాస్వామి పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం తిరుపతి ఐడిబిఐ బ్యాంక్ తరపున 70000 విలువచేసే 13 టేబుల్స్‌ను ఏజీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ హెడ్ రమేష్, మేనేజర్ బి.వి శరత్ ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజనల్ హెడ్ సాయి కృష్ణ ఆదేశాల మేరకు సిఎస్ఆర్ నిధులలో పాఠశాలకు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. పాఠశాల కో ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు మాట్లాడుతూ తన మాటకు గౌరవం ఇచ్చి పాఠశాలకు సహాయం చేసిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం బ్యాంకు ఉద్యోగులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ రాణి, శశి కళ, మునిమనోహర్, యాగయ్య, నాగమ్మ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

# వీకోటలో చైన్ స్నాకర్స్




**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్టు 20:**
పట్టపగలే వీకోట సెంటర్ బస్టాండ్ బజార్ మార్గంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి మహిళా మెడలో నుండి బంగారు తాళిబొట్టు చైను లాక్కొని వెళ్ళిపోయినారు. అప్రమత్తమైన మహిళా, స్థానికులు వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి తమకు జరిగిన అన్యాయం గురించి పోలీసులకు తెలుపగా వారు వెంటనే స్పందించి సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఎలాంటి నంబర్ ప్లేట్ కానీ పేర్లు కానీ లేని ద్విచక్ర వాహనంలో ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి మరో వ్యక్తి క్యాప్ ధరించి వారి వాహనంలో స్పీడ్‌గా కుప్పం దారి గుండా వెళ్తున్న దృశ్యాలు సిసి టీవీ కెమెరాల్లో రికార్డు అయినాయి. ఆ దృశ్యాలను పరిశీలించగా వారు వేరే ప్రాంతానికి చెందిన వారిగా అనుమానించి, ఆ ఫోటోలను పోలీసులు వెంటనే మాంధ్యమాల్లో ప్రసరింప చేసి ఎవరైనా వీరుని గుర్తుపట్టితే వెంటనే పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని తెలియజేస్తూ మరియు వీకోట సర్కిల్ పోలీస్ స్టేషన్ పోలీసులు దర్యాప్తును ప్రారంభించినారు.

## పొగలేని పొయ్యి.. గుజరాతి కట్టెల పొయ్యిలు



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్ట్ 20:**
గుజరాతి టెక్నాలజీతో తయారు. చేసిన పగలేని ఎక్కువ మంట వచ్చే పొయ్యలను మండల ప్రజానీకాని కోసం వీకోటలో అమ్మకానికి వచ్చినాయని వీటిని పరిసర ప్రాంతా రైతులు, ఉద్యోగస్తులు కొనుక్కొని వంట చేసుకోవడానికి కానీ వేడి నీరు కాంచుకోవడానికి కానీ ఉపయో గించుకోవచ్చునని, ఈ పొయ్యి పోర్టబుల్ కలిగిన పొయ్యని, దీన్ని ఎక్కడికైనా తీసుకొని వెళ్లడా నికి సులువుగా ఉంటుందని వర్తకుడు తెలిపినాడు. ముఖ్యంగా ఈ పోయి ఒక్కసారి కరెంటుతో రీఛార్జ్ చేస్తే కనీసం రెండు రోజులు వంట వార్పు చేసుకో వచ్చని, ఈ పొయ్యి మొలగడానికి కట్టెలు గాని లేక బొగ్గులు కానీ ఉపయోగించ వచ్చునని, ఇందులో నుండి ఎలాంటి పొగ కూడా రాదు అని మనకు ఎంత కావాలో మంట అంత పెంచుకోవచ్చునని చాలా సులువైన పద్ధతిలో ప్రజలకు సౌకర్య వంతంగా ఉంటుందని వర్తకుడు లోకేష్ తెలిపినారు. ఇతను పలమనేరు సమీపం గడ్డూరి గ్రామానికి చెందిన వాడని తమ మొబైల్ నెంబర్ 99 410 33983 అని ఎవరికైనా కావాల్సి ఉంటే తమ నెంబర్కు ఫోన్ చేసిన ఈ పగలేని రీఛార్జబుల్ గుజరాతి పోయి సప్లై చేయగలనని తెలియజేసినాడు.

## వినాయక ఉత్సవాలకు
# అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలి

**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 20:**




వినాయక ఉత్సవాలకు అనుమతుల కోసం అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండపాలనిర్వాహకులు https://ganeshutsav.net వెబ్సైటును ఉపయోగించి సింగల్ విండో విధానంలో ఆన్లైన్లో అనుమతులు పొందవచ్చునున్నారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి అన్నారు ఈ ఆన్లైన్ వ్యవస్థ ఉత్సవాలను సురక్షితంగా పారదర్శకంగా నిర్వహిం చడానికి ఉద్దేశింపబడిందని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన
# ఫోరం ఫర్ అంగన్వాడి యూనియన్.



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 20:**
ఎన్నో ఏళ్ల నుండి అంగన్వాడి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా రూపాంతరం చెందాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చేసిన పోరాటాలు ప్రస్తుత రాష్ట్రములో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా ప్రమోట్ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఫోరం పర్ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అందులో భాగంగా బుధవారం పలమనేర్ పట్టణములో ఆ యూనియన్ నాయకురాలు నాగరత్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లతో సమానంగా పనిచేస్తూ వేతనం మాత్రం 7000 రూపాయలు తీసుకొని కష్టాలతో కుటుంబాలు పోషించుకునే వారని అంగన్వాడీలు చేసిన పోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనికరించి జిఓఆర్‌టి నెంబర్ 116 ప్రకారం ప్రమోట్ చేయడం వలన రాష్ట్రవ్యాప్తంగా 4687 మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లతో పాటు 11,500 వేతనం తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినందుకు సంతోషం వ్యక్తపరిచారు. ఎన్నికలప్పుడు కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో అంగన్వాడీ సమస్యల పైన ఫోరం ఫర్ అంగనవాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ముందుండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాణి, చిలకమ్మా, నిర్మల, రెడ్డమ్మ, సరస్వతి, భారతి, రేణుక, వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.



## విష సర్పం కాటేసిన వ్యక్తికి అస్వస్థత

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 20:**
విష సర్పం కాటేసిన వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు అనే మేస్త్రి స్థానికంగా ఓ ఇంటి లో మేస్త్రి పని చేస్తుండగా విషసర్పం కాటేసింది, గుర్తించిన అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి సిఫారసు చేశారు.

## గడ్డం వారి పల్లి సర్పంచ్ భాగ్యవతికి ఘన సన్మానం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 20:**
స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీ ఎర్రకోటలో అరుదైన అవార్డు అందుకున్న గడ్డం, వారి పల్లి సర్పంచ్ భాగ్యవతి హరినాథ్ స్థానిక వైకాపా నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని జంగాలపల్లి రమణ భవనంలో వైకాపా మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ పంచాయతీ నుంచి ఢిల్లీ స్థాయిలోకి వెళ్లి అవార్డు తీసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డు రావడం పట్ల రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జెడ్పి మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిలకు సర్పంచ్ భాగ్యవతి హరినాథ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రుక్మిణమ్మ పార్టీ ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, ఎంపీటీసీ తొండ శ్రీరాములు, సర్పంచులు కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రాజు, చెంగరెడ్డి, షంషీర్ , పవన్, రాయల్ భాస్కర్, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖచ్చితమైన సరిహద్దుల కోసమే
# భూముల సర్వే: ఆర్డీవో భవాని

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఆగష్టు 20:**
ఖచ్చితమైన సరిహద్దుల కోసమే భూముల రీసర్వే చేస్తున్నట్లు పలమనేరు ఆర్డిఓ భవాని అన్నారు. బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో భూమి రి సర్వే పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ రెవిన్యూ గ్రామాల సర్వే అవుతుందని తర్వాత ప్రభుత్వ భూమి అనగా చెరువులు వాగులు, వంకలు వంటివి రి సర్వే చేస్తారన్నారు. ఆటో తర్వాత రైతులకు సంబంధించిన పట్టాలు సర్వే అవుతాయన్నారు. ఈ తంతు అంతా మూడు నెలల్లో ముగిసేలా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. రీ సర్వేను సమగ్రవంతంగా చేపట్టి అనుకున్న కాల పరిమితులో అందించాలని సూచించారు, అనంతరం రీ సర్వే అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పార్వతి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రెప్ప వాలిస్తే అధోగతే

**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 20:**



నిత్యం వేలాది వాహనాలు తిరిగే., వీకోట నుండి బెంగళూరు నగరం వైపు వెళ్లే ప్రధాన రహ దారి వీకోట పట్టణంలోని " వ్యవసాయ మార్కెట్" ఎదురుగా సుమారు రెండు అడుగుల లోతు గల గుంతలతో నిత్యం వాహనదారులకు ఇబ్బందికరంగా మారినది. ఈ గుంతలను సంబం ధిత అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన తారు రోడ్డు గాని లేక సిమెంట్ కాంక్రీట్ రోడ్డు అయినా వేసి వాహనదారులకు మరియు నిత్యం మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ప్రమాదాలు గాని, ప్రాణ..ఆస్తి... నష్టాలు గాని జరగకుండా ముందస్తుగా స్పందించాలని ఆర్ అండ్ బి అధికారులకు ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

# మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన
## జిల్లా జెడ్‌పి డిప్యూటీ సిఇఓ వెంకట నారాయణ

**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 20:**



వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయాన్ని చిత్తూరుజిల్లా జెడ్‌పి డిప్యూటీ సిఇఓ వెంకట నారాయణ సందర్శించటం జరిగింది. ఈ సందర్భంగా జెడ్‌పి డిప్యూటీ సిఇఓ మాట్లాడుతూ పిజి ఆర్ఎస్ ఫిర్యాదులని ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని, సమాచారహక్కు దరఖాస్తులకు నిర్ధేశిత సమయంలోపు సమాచారం అందించాలని, అన్నీ గ్రామ పంచాయితీల్లో ప్రతిరోజు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలనీ సూచించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఎంపీడీఓ పురుషోత్తం, ఏఓ నాగమణి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న సచివాలయం సిబ్బందిని
# సన్మానించిన టిడిపి నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 20:**
వెదురుకుప్పం మండలం పాతగుంట పంచాయతీలో మునుపటి సచివాలయ సిబ్బంది. బదిలీపై వెళుతున్న వారిని టిడిపి జిల్లా యువత వైస్ ప్రెసిడెంట్ చంద్రబాబు రెడ్డి, యువ నాయకులు లోకనాథ్ రెడ్డి, బీసీ నాయకులు తిమ్మరాజు ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, ఉప సర్పంచ్ గురుమూర్తి రెడ్డి, తిరుపాల్ రెడ్డి, బొజ్జా రెడ్డి, వినాయకరెడ్డి, మునిరత్నం రెడ్డి. తదితర నాయకులు పాల్గొన్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల సేవలు
# ఏపీ యువత భవిష్యత్తుకు నాంది



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు20:**
రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వర్చువల్ ప్రారంభించారు. తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ నందు వర్చువల్ నేడు శ్రీకారం. రేణిగుంట ఒక స్టార్టప్ కేంద్రంగా మార్చడంలో ఈ హబ్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారుల ఆశిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ హబ్ ఒక కేంద్రంగా పనిచేయనుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల సేవలు ఏపీ యువత భవిష్యత్తుకు నాంది.యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాల ను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధికిదోహదపడు తుందని, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ హబ్ ప్రధానలక్ష్యాలు, రాష్ట్రంలో ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి సృష్టిని ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్‌కోఎనర్జీ, ఒంగక్, గైల్, అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉన్నాయి.వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభి వృద్ధి,పోటీతత్వం వంటి వాటిలో ట్రైనింగ్ ఇస్తారు. పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐ హెచ్ భాగస్వామ్యం. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలి జెన్స్ వంటి వాటిల్లో స్టార్ట్‌పలకు సహకారం అందిస్తుంది.వ్యవసాయం,అనుబంధ రంగాల్లోనూ, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది. టెక్స్‌టైల్ఇన్నోవేషన్, అపెరల్,ప్రత్యామ్నాయ ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్,పునరుత్పాదక ఇంధన రంగాలు, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్ రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. పట్టణ రవాణా, సముద్ర రవాణా, సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు శిక్షణను ఇస్తుంది. ఈ హబ్‌లు రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ తర హా ఇకోసిస్టమ్‌ను సృష్టించడానికి రూపొందించడానికి ఈ స్టార్ట్‌పల్లో మహిళలకు, యువత, నైపుణ్యం కలిగినవారికి ప్రాధాన్యం ఇస్తారు. స్టార్ట్‌పలతో వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.ఈ కార్యక్రమంలో కాళహస్తి శాసనసభ్యులుబొజ్జల సుధీర్రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్,జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి ప్రజాప్రతి నిధులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.



Cell: 9440352030 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# ఇంటికో పారిశ్రామిక వేత్త


-మొదటిపేజీ తరువాయి

హబ్ ప్రారంభిస్తున్నాం. రతన్ టాటా నిరాడంబరత, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శం. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయం. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారు. రతన్ టాటా ఆలోచనల్ని భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ లను ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురం లోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయి. ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువతకు ఉన్న వినూత్న ఆలోచనల్ని క్రోడీకరించి ప్రోత్సహించేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుంది. యువపారిశ్రామిక వేత్తలు అవకాశాలను వాడుకోండి. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను. ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటీకి సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా. అగ్రిటెక్ లో ఇన్నోవేషన్ కు విస్తతమైన అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, ఇలా అనేక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి.' అని సీఎం వివరించారు. సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదేనని నాడు గుర్తించాను. దేశంలో ఎవరూ చేయనంతగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాం. సంపద సృష్టి జరగాలంటే ఆర్థిక వద్ధి అవసరం. గత 10 ఏళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివద్ధి ప్రణాళికలు రచించాం. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధింటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూటింగ్ హబ్ గా అభివద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం.' అని చంద్రబాబు చెప్పారు. ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయి రిజిస్ట్రేషన్లు జరగటంపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు నారా లోకేష్ , నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు హాజరయ్యారు.



# ఖజానాకు భారంగా తాయిలాలు

**విజయవాడ :** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాల పేరుమీద జరుగుతున్న తాయిలాల పంపకం ఖజానాకు పెనుభారంగా మారుతోంది. గతంలో వైసిపి, ప్రస్తుత కూటమి పోటీపడి మరీ అప్పుల మీద అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిజానికి అవసరంలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ దానకర్ణులు అనిపించుకోవడం కోసం సరైన రాబడి రాకుండానే ఇలా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం అప్పుల మీద అప్పులు చేస్తూ వెల్ఫేర్ స్కీమ్ అమలు చేస్తున్న తీరు మేధావి వర్గాల్లో ఏపీ భవిష్యత్తుపై ఆందోళన పెంచుతోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 లో దిగిపోయేసరికి కేవలం సంక్షేమ పథకాలు కోసం ప్రతి ఏటా 70 వేల కోట్ల వరకూ ఖర్చుపెట్టినట్టు ఆయనే స్వయం గా చెప్పుకున్నారు. దీనికోసం వివిధ కార్పొరేషన్లలోని డబ్బులు సైతం వాడేసారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి మరీ అప్పులు తెచ్చారని టిడిపి, జనసేన తీవ్రంగా ఆరోపించేవి. ఏపీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది అనేది వారి ప్రధాన విమర్శ గా ఉండేది. అమ్మ ఒడి, నాడు -నేడు లాంటి పథకాల వల్ల చాలామందికి మేలు జరిగిన మాట వాస్తవమే అయినా మిగిలిన అనేక పథకాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది అనేది చాలామంది ఎనలిస్ట్ లు, ఆర్థిక వేత్తల అభిప్రాయం. అటు అమరావతి పక్కకు పోయి, మూడు రాజధానుల వ్యవహారం బెడిసి కొట్టి, పోలవరం ప్రాజెక్టు అతిగతీ లేని పరిస్థితుల్లో పడిపోవడం తో చివరికి సంక్షేమ పథకాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని కాపాడలేకపోయాయి. అప్పట్లో రాష్ట్రం లోని రోడ్ల పరిస్థితులపై సామాన్యులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు తీవ్ర అసంతృప్తి వెళ్ళబుచ్చేవారు. విచిత్రంగా వీరిలో చాలామంది సంక్షేమ పథకాల లబ్ది దారులే కావడం విశేషం. అంటే ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి, కనీస సౌకర్యాలు ముఖ్యమనేది చాలా స్పష్టంగా పాలకులకు తెలియజేసిన ఎన్నికల ఫలితాలు అవితెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రో డెవలప్మెంట్ లీడర్గా చంద్రబాబు కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్థిక పరమైన సంస్కరణలకు ఏమాత్రం వెనుకాడే వ్యక్తి కాదని చంద్రబాబు నాయుడు పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టడానికి ముఖ్యమైన కారణం ఇదే. 2024 ఎన్నికల్లోనూ ప్రజలు చంద్రబాబుపై రాష్ట్ర అభివృద్ధి అనే యాంగిల్ లోనే ప్రధానంగా ఓట్లు వేశారు. కేవలం సంక్షేమ పథకాలు కోసమే అయితే ఆ ఓటు జగన్ కే వేసి ఉండేవారన్న అభిప్రాయం చాలా మంది రాజకీయ నేతల నుండి వెలువడుతోంది. కానీ చంద్రబాబు మాత్రం సంక్షేమ పథకాలలో కూడా తన ముద్ర చూపే దిశగా ఒకదాని వెంట ఒకటి పథకాలు అమలుచేసుకుంటూ వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే డెస్ప రేషన్ తో ఇచ్చిన హామీలపై అప్పట్లోనే మేధావివర్గాల నుంచి విమర్శలు వెలువడ్డాయి. ముఖ్యంగా 20లక్షల మంది యువకులకు నెల నెలా 3000 చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు 1500 చొప్పున ఇస్తామన్న హామీ లపై అవెలా సాధ్యమన్న విమర్శలు బలంగా వచ్చాయి. దానికి తగ్గట్టే ఇటీవల రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు కూడా " మహిళలకు 1500 చొప్పున ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ " ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి చెప్పకనే చెప్పారు. ఎన్నడూ లేనట్టు మూడు లక్షల ఇరవై రెండు వేల కోట్లతో ప్రవేశ పెట్టిన 2025-26 ఏపీ బడ్జెట్లో కూడా వీటి పై స్పష్టత ఇవ్వలేదు. అయినప్పటికీ బడ్జెట్లో అధిక భాగం సంక్షేమ పథకాలకు కేటాయించారు. ఏపీ జీవనాడి అయిన పోలవరానికి బడ్జెట్ లో కేటాయించింది 6300 కోట్లు మాత్రమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నామని చెబుతూనే ఆర్థిక మంత్రి రెవిన్యూ లోటు 33 వేల కోట్లు, ద్రవ్య లోటు దాదాపు 80000 కోట్లుగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాల మాట ఎలా ఉన్నా ఏపీ ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకుంటున్నవి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం, రాజధాని కి ఒక రూపం రావడం. వీటితోపాటు గుంతలు లేని రోడ్లు,లోపాలు లేని విద్య వైద్య సౌకర్యాలు. ప్రస్తుతం ఒకరిపై ఒకరు పోటీపడి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు ప్రభుత్వం నుంచి కోరుకుంటున్న అంశాలకు అడ్డుకట్టుగా మారిపోయే ప్రమాదం లేకపోలేదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఈ సంక్షేమ పథకాల హామీ లను మరింతగా పెంచే పనిలో కచ్చితంగా రాష్ట్రం లోని పార్టీలు పడతాయి. నిజం చెప్పాలంటే జగన్,చంద్రబాబు ఒక విధమైన పులి స్వారీ చేస్తున్నారనే చెప్పాలి. సవారీ చెయ్యలేరు.. అలాగని కిందకు దిగనూ లేరు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా ఉచిత హామీలతో పరుగులు పెట్టడంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా చర్చించి ఒక కీలక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసిందని అభిప్రాయపడ్డారు సీనియర్ రాజకీయవేత్త, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్. ఆయన ప్రస్తుతం జాతీయ పార్టీ బిజెపిలో సభ్యుడిగా ఉన్నారు. ఇలా అన్ని పార్టీలు ఉచితాలకు సంబంధించిన హామీలపై ఒక బ్రేకుల్లేని విధానంతో ముందుకు సాగడం భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థకు చేటు చేయడంతో పాటు పేదలను మరింత పేదలుగా మార్చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు.



# సిక్కోలులో భయపెడుతున్న కుక్కలు

**శ్రీకాకుళం :** కిందటి నెల 14న జిల్లాలోని లావేరు మండలం మురపాక గ్రామంలో కుక్క కరవడంతో బొడ్డ అజయ్ అనే 24 ఏళ్లు యువకుడు మృతి చెందాడు. అజయ్ మృతి చెందిన రోజుకి సరిగ్గా రెండు నెలల ముందు ఊరులో అతనికి కుక్క కరిచింది. అయితే కుక్క కాటును లైట్ తీసుకున్న యువకుడు యాంటి రాబీస్ వ్యాక్సిన్ చేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో కిందటి నెల 14న ఇంటి వద్ద అజయ్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు యువకు డిని వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు అజయ్. అయితే అజయ్ మృతి చెందిన 34 రోజులకు అనగా సోమవారం మధ్యాహ్నం బూర్జ మండలం తోటవాడకు చెందిన దనాన అప్పమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు కుక్క కాటుకు మృతి చెందింది.కిందటి నెల 27న ఒకేరోజు తోటవాడకు చెందిన అప్పమ్మతో పాటు అదే మండలంకి చెందిన అయ్యవారిపేట, అన్నంపేట కొల్లివ లస, కంట్లాం గ్రామాలలో 15మందిని, రెండు ఎద్దులను పిచ్చి కుక్క కరిచింది. ఒక్క ఉదుటున అప్పమ్మపైకి ఎగిరి కన్ను పక్క భాగం అంతటిని నోటితో పట్టి పీకేసింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని శ్రీకాకుళం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మళ్లీ అక్కడి నుంచి విశాఖపట్నంలోని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అయితే ఇటీవలే ఇంటిపట్టున ఉంటూ టైముకి మందులు వేసుకుంటుండగా ఆదివారం అడెన్‌గా ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీంతో శ్రీకాకుళం ఉఉఊ కి తరలించారు కుటుంబసభ్యులు. దీంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ అప్పమ్మ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. కిందటి నెల అప్పమ్మను కరిచిన పిచ్చి కుక్కే. రెండు ఎద్దులను కూడా కరిచింది. దీంతో కొద్ది రోజులకి ఆ ఎద్దులు కూడా చనిపోయాయి. అలా మాట్లాడిన మరుసటి రోజే అప్పమ్మ మృతి చెందింది. అప్పమ్మ మృతితో మిగిలిన కుక్కకాటు బాధితులు తమ ఆరోగ్యం పట్ల ఆందోళన చెందు తున్నారు. 2023 ఏప్రిల్‌లో జి.సిగడాం మండలం మెట్టవల సలో 18 నెలల చిన్నారిని కుక్క నోటితో కరుచుకొని సమీప తోటల్లోకి తీసుకువెళ్లి తీవ్రంగా గాయపరించింది. తరవాత తల్లిదండ్రులు చిన్నారిని రాజాం ప్రభుత్వ హాస్పిటలకి తరలిం చినప్పటికీ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. ఇలా కుక్కలు కరిచి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులు కుక్కను చూస్తే చాలు బెంబేలెత్తి పోతున్నారు

## ఇళ్లులేని పేదలను గుర్తించేందుకు సర్వే

-మొదటిపేజీ తరువాయి

గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.

**త్వరలో 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919 కోట్ల చెల్లింపు :**

రాష్ట్రానికి పీఎంఏవై(అర్బన్)బీఎల్సీ, పీఎంఏవై (గ్రామీణ్), పీఎం జన్మాన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాది కాలంలో గహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లేఅవుట్లలో... రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది. పీఎం జన్మాన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్దిదారులు ఇంకా గహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. 2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరింది.

## 'స్త్రీ శక్తి' పథకం మహిళలకు ఆర్థిక భరోసా

-మొదటిపేజీ తరువాయి

అభిప్రాయాలను మంత్రి ఎస్. సవిత అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఎస్. సవిత మీడియాతో మాట్లాడుతూ మహిళలను గౌరవించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఆకాశంలో సగం అవనిలో సగం అంటూ మహిళలు కూటమి పాలనలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించటం ఆనందంగా ఉందన్నారు. బస్ స్టేషన్ లో అవ్వని, అమ్మనీ, ఎవ్వరిని పలకరించినా ఆనందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కు జేజేలు పలుకుతూ, హదయ పూర్వకంగా అభినందనలను అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వల్ల మహిళలు ఎంతో ఆనందంతో బస్సుల్లో ప్రయాణించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా కల్గుతుందన్నారు. సూపర్ సిక్స్ లో ఇప్పటికే ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాలను అమలు చేయడం జరుగిందని, పెన్షన్ లను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత ఇచ్చిన వ్యక్తి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశ్యంతో ఆస్తి హక్కు కల్పించారన్నారు. తదనంతరం అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. గత ప్రభుత్వం ధరలను పెంచి పేదవాడిని పలు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మా ప్రభుత్వం పేద వారికి బాసటగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు పోవాలనే ఉద్దేశ్యంతో వారికి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్త్రీ శక్తికి ఎదురులేదని వారు ఆర్థికంగా స్థిరపడే విధంగా వారికి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు అవకాశాలిస్తే అద్భుతాలు సష్టిస్తారన్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు కనీసం రూ. 3,000 వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవటంతోపాటు ఏడాదికి రూ. 36,000 ప్రయాణ ఖర్చు కలిసి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం కొరకు కషి చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే భోజనం, టిఫిన్ అందిస్తున్నామన్నారు.

## విశాఖ ఉక్కుపై కుట్ర తగదు చంద్రబాబు'

-మొదటిపేజీ తరువాయి

తీసేశారు. అబద్ధాలపై చర్యలు తీసుకోవాల్సి వస్తే సీఎం, మంత్రులపై చర్యలు తీసుకోవాలి. స్టీల్ ప్లాంటు లో 32 విభాగాలు ప్రైవేట్ పరం చేశారు. వైఎస్సార్‌సీపీకి ద్వంద వైఖరి లేదు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేదే మా నినాదం.స్టీల్ ప్లాంట్ కి 14 వేల కోట్లు ప్యాకేజీ ఇచ్చినప్పుడే మేము అనుమానం వుంది అని చెప్పాం. స్టీల్ ప్లాంట్ అప్పులు తీరాక ప్రైవేట్ చేయాలని పన్నాగం చేస్తున్నారు.సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడు స్టీల్ ప్లాంట్ గురుంచి ఎందుకు మాట్లాడటం లేదు'అని ప్రశ్నించారు.

## రెండేళ్లలో 9లక్షల ఇళ్ల నిర్మాణం

**అమరావతి:** గృహ నిర్మాణశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసిందని, ఆరు లక్షల మందికి గృహ అవసరాలున్నట్టు గుర్తించామని మంత్రి పార్థసారథి తెలిపారు. గృహనిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రులు పార్థసారథి, నారాయణ మీడియాతో మాట్లాడారు. "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం. ఎన్టీఆర్ హౌసింగ్ కింద గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. రెండేళ్లలో మొత్తం 9లక్షల ఇళ్లు పూర్తి చేసేలా హౌసింగ్ విభాగం చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం రూ.2,900 కోట్ల కేంద్రం నిధులను మళ్లించింది. అప్పటి ఆర్థిక అవకతవకలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం. గత ప్రభుత్వం తప్పిదం కారణంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన ఈఎంఐలు రూ.140 కోట్లను సీఎం ఆదేశాల మేరకు ఈ ప్రభుత్వం చెల్లించింది" అని మంత్రులు వివరించారు.


## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి పోలీస్ వారి సూచన




**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 20బీ**

కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలకు తెలియజేయడమేమనగా రాబోయే శ్రీవినాయక చవితిపండగ సందర్భముగా శ్రీవినాయక విగ్ర మండపములు పెట్టి పండగ జరుపుకొనే ఉత్సవ కమిటీ సభ్యులకు తెలియజేయడ మేమనగా, వీధులలో పెట్టు మండపముల పొలిసు పర్మిషన్ల కొరకు ఈ సంవత్సరము కొత్తగా పొలిసు వారిచే ఆవిష్కరించబడిన ganeshutsav.net అను వెబ్‌సైట్ ద్వారా మాత్రమే అప్లై చేసుకోవలసిందిగా తెలియజేయుచున్నాము. కమిటి సభ్యులు ముందుగా పై తెలిపిన వెబ్ సైట్ కు వెళ్లి మీ ఫోన్ నెంబర్ ను ఎంటర్ చేసినచో మీకు ఒక ఓ.టి.పి వస్తుంది. దాన్ని సదరు వెబ్ సైట్‌లో పొందుపరిచిన చో మీకు ఒక అప్లికేషన్ డౌన్ లోడ్ అవుతుంది. ఆ అప్లి కేషన్ పేర్కొన్న అన్ని వివరాలతో సమా చారాన్నినింపి OKEY చేయడంతో,సదరు అప్లికేషన్ లోకల్ పోలీస్ స్టేషన్ వారికీ చేరుతుంది. సదరు పోలీస్ వారు శ్రీవినాయక విగ్ర మండప ములు పెట్టె ప్రదేశానికి వెళ్లి విచారించి అన్ని సక్రమంగా వున్న శ్రీవినాయక విగ్రమండపములకు ఆన్లైన్ ద్వారా అనుమతి ఇవ్వబడును. సదరు కమిటీ సభ్యులు " ganeshutsav.net అను వెబ్ సైట్ నందే ఎన్.ఓ.సిను పొందవలెను. దీనితో పటు సదరు మండప వివరాలతో గల క్యూ ఆర్‌కోడ్ కూడా పొంది దాన్నిలామి నేషన్ చేసుకొని మీ మండపము వద్ద ప్రదర్శించవలెను. క్యూఆర్‌కోడ్ లేని విగ్రహ మండపములను పోలీస్ పెర్మిషన్ లేనివాటిగా పరిగణించబడును,వారికీ అనుమతి నిరాకరించబడును. కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కేవలము మూడు రోజులు మాత్రమే సదరు ఉత్స వాలకు పర్మిషన్ ఇవ్వబడును. ప్రశాంత వాతావరణములో శ్రీవినాయక చవితి పండగ జరుపుకోవ లసింది. ప్రజలను కోరడమైనది.

### తొలగించిన కె.ఆదినారాయణ
## దివ్యాంగుల పెన్షన్‌ను పురుద్ధరించండి.



**పెనుకొండ/రొద్దం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 20:** శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం యల్.తిమ్మాపురం గ్రామంలో నివాసంవున్న దివ్యాంగుడైన కురుబ ఈరప్ప కుమారుడు ఆదినారయణ పెన్షన్‌ను పునరుద్ధరించాలని బుధవారము ఎంపీడీఓకు స్వయానా పెద్ధమంతూరు సచివాలయంలో వినతిపత్రం అందచేశారు. 2016వ యేడాది రోడ్డు ప్రమాదంలో ఆదినారాయణకు కాళ్ళు, చేతులు చొచ్చుకొని పోయి శరీరంలోని అవయావాలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని బెంగలూరు వైద్యులు ఇచ్చిన వైద్యం వల్ల ప్రాణాలు దక్కాయని, నిర్జీవంగా వున్న విగలాంగుడు ఆదినారాయణ సతీమణి తన బిడ్డలకు తండ్రి దక్కాలని ఆశతో నిరంతరం సేవలు అందించి ప్రాణాలు కాపాడు కొన్నామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇక ఆర్తో డాక్టర్లు మంచానికే పరిమితం అవుతాడని చెప్పారని అటువంటి వ్యాధిగ్రస్థున్ని సపర్యలు చేస్తూ ప్రాణాలు కాపాడుకోవడానికి కృషి చేశామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.కనీసం నడవలేని స్థితిలో ఉన్నటువంటి దివ్యాంగుడు ఆదినారాయణ పెన్షన్‌ను తొలగించడానికి నోటీసులు అందించారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లో 90 శాతం వైకల్యం ఉన్నట్లుగా ధ్రువీ కరించినా వాటిని కాదని ఇష్టానుసారం 70 శాతం తక్కువ ఉందంటూ పెన్షన్ తొలగించి దివ్యాంగుడికి నష్టం చేకూరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధివ్యాంగుడు కుమార్తె, కుమారుడు బి.టెక్ ఇంజనీరింగ్ కోర్సు అభ్యసిస్తున్నారని పెన్షన్ తొలగిస్తే బీటెక్ చదువుచున్న విద్యార్థులకు చదువులకు ఆటంకం కలుగుతుందనీ పర్కోన్నారు. తొలగించిన పెన్షన్ వెంటనే పునరుద్దరించాలని యదావిధంగా 90 శాతం పర్మినెంట్ సర్టిఫికెట్ మాదిరి సవరించాలని మంత్రి సవితమ్మను, జిల్లా కలెక్టర్‌ను ఆదినారాయణ కోరుతున్నాడు.

కుప్పం రైల్వే స్టేషన్లో డివిజినల్
## రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం అందించిన
### కుప్పం టిడిపి నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 20:** కుప్పం రైల్వే స్టేషన్లో డివిజినల్ రైల్వే మేనేజర్‌ను కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, విస్తరణ విభాగ కమిటీసభ్యుడు రాజారాం, కుప్పం మున్సిపల్ ట్రెజరర్ గిరిధర్ బాబు, గుల్లేపల్లి రవి, కదిరప్ప మర్యాదపూర్వకంగా కలిసి తంబిగానిపల్లి గ్రామం, కుప్పం మండలం, బెంగుళూరు నుండి చెన్నై రైల్వే మార్గంలోని లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి డివిజినల్ రైల్వే మేనేజర్, వినతి అందజేశారు.




# ఐటీఆర్ గడువు మళ్లీ పొడిగింపు?




ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేసేందుకు గడువు సమీపిస్తోంది. ఇంకో 25 రోజులు మాత్రమే ఉంది. అయితే, ఇప్పటికీ కొన్ని ఎక్సెల్ యుటిలిటీలను విడుదల చేయలేదని, ఇప్పటి వరకు అందుబాటులోకి తెచ్చిన ఐటీఆర్ ఫారాలు, ఎక్సెల్ యుటిలిటీలు ఆలస్యం కావడం ట్యాక్స్ పేయర్లపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మందిపు సంవత్సరం 2025-26కు సంబంధించి ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసేందుకు ప్రభుత్వం ఐటీఆర్ గడువును పొడిగించనుందా? అంటే తప్పనిసరిగా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ట్యాక్స్ పేయర్లు గడువు పెంచాలని కోరుతున్నారు. ఐటీఆర్ గడువు దగ్గరపడుతున్న క్రమంలో ట్యాక్స్ పేయర్లు, ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌లో ఆందోళన సైతం పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గుజరాత్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహా చాలా మంది పన్ను నిపుణులు ఐటీఆర్ ఫైలింగ్ డెడ్‌లైన్ మరోసారి పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 15, 2025 వరకు ఉన్న గడువును పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ట్యాక్స్ పేయర్లు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఇచ్చిన గడువులోపు ఐటీ రిటర్నులు ఫైల్ చేయడం అనేది సాధ్యం కాదంటున్నారు.ఈ క్రమంలోనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ కి లేఖ రాసింది గుజరాత్ పారిశ్రామిక సంఘం జీసీసీఐ. ఐటీ రిటర్నుల గడువును మరోసారి పొడిగించాలని కోరింది. ఈసారి ట్యాక్స్ పేయర్లు, పన్ను నిపుణులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఆలస్యంగా విడుదల చేయడమేనంటున్నారు. ఏప్రిల్ రెండో వారంలోపు రావాల్సిన ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఏప్రిల్ చివరి నాటికి కొన్నింటిని మాత్రమే రిలీజ్ చేసింది. ఇప్పటికీ చాలా ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐటీఆర్- 5 యుటిలిటీ ఆగస్టు 8, 2025 తేదీన విడుదల చేశారు. దీంతో ఐటీఆర్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యేందుకు తక్కువ సమయం ఇచ్చినట్లయింది. ఇక సిస్టమ్ ఎర్రర్స్, లాగిన్ ఫెయిల్యూర్స్, టైమ్ ఔట్స్ వంటివి ఐటీఆర్ అప్లోడ్ చేస్తున్న సమయంలో ఎదురవుతున్న సమస్యలుగా జీసీసీఐ సూచించింది. అలాగే ట్యాక్స్ పోర్టల్‌లో ఆడిట్ రిపోర్ట్స్ సైతం ఉండడం లేదని తెలిపింది. అలాగే ఫారం 26 ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్ వంటి వాటిల్లోని వివరాల్లో తేడాలు ఉండడమూ ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలిపింది. ఆగస్టు నుంచి నవంబర్ వరకు పలు పండగలు వస్తున్నాయి. ఇది ట్యాక్స్ ప్రొఫెషనల్స్ పనిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సెప్టెంబర్ 15లోపు ఐటీ రిటర్నుల ఫైలింగ్ పూర్తి కాదని, మరింత సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

# తగ్గినా పసిడి ధరలు



ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం ఇందుకు ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు.ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన వాణిజ్య చర్చల అనంతరం ఎలాంటి ప్రతికూల పరిణామాలు లేకపోవడం కూడా ధరల స్థిరత్వానికి దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఆగస్టు 19, సోమవారం నాడు బంగారం ధరలు తగ్గాయి. ఈ రోజు 24 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 44 తగ్గింది. ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధర రూ. 10,075 కాగా, 100 గ్రాముల ధర రూ. 10,07,500గా ఉంది. అలాగే, 22 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 9,235గా, 18 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 7,556గా నమోదైంది. వివిధ భారతీయ నగరాల్లోనూ బంగారం ధరలు దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. హైదరాబాద్, (%ష్ట్రఎనవతీఖఝి౦%) విజయవాడ, చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,00,750 వద్ద ఉంది. అదేవిధంగా, ఈ నగరాల్లో 22 క్యారట్ల 10 గ్రాముల ధర రూ. 92,350గా ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ మరియు అహ్మదాబాద్ నగరాల్లో మాత్రం ధరలు కొద్దిగా ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,900 కాగా, 22 క్యారట్ల ధర రూ. 92,500గా ఉంది. అహ్మదాబాద్‌లో 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,800 మరియు 22 క్యారట్ల ధర రూ. 92,400గా నమోదైంది. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా, ఆర్థిక నిపుణులు బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం వల్ల ధరలు తగ్గుతున్నాయి. అలాగే, అమెరికా మరియు రష్యా మధ్య జరిగిన వాణిజ్య చర్చల తర్వాత ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తకపోవడం కూడా ఒక కారణం.

### ఎయిర్టెల్ యూజర్లకు షాకింగ్ న్యూస్

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. గతంలో బాగా ప్రాచుర్యం పొందిన రూ. 249 ప్రీపెయిడ్ ప్లాన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ఇవాళ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్, వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ప్లాన్ కింద వినియోగదారులకు 28 రోజుల పాటు అన్‌లిమిటెడ్ కాల్స్ మరియు రోజుకు 1+దీ డేటా లభించేది. తక్కువ డేటా అవసరం ఉన్న వినియోగదారులకు ఇది ఒక ఉత్తమ ఎంపికగా ఉండేది. ఈ నిర్ణయంతో ఎయిర్‌టెల్, ఇప్పటికే ఈ ప్లాన్‌ను రద్దు చేసిన జియో బాటలోనే పయనించినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల జియో కూడా తమ వినియోగదారులకు అందిస్తున్న రూ. 249 ప్లాన్‌ను రద్దు చేసింది. ఇప్పుడు ఎయిర్‌టెల్ కూడా అదే నిర్ణయం తీసుకోవడంతో, రోజుకు 1+దీ డేటా ప్లాన్‌ల లభ్యత తగ్గిపోయింది. ఈ పరిణామం టెలికాం రంగంలో ధరలు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జియో మరియు ఎయిర్‌టెల్ తర్వాత, వొడాఫోన్ ఐడియా కూడా ఈ ప్లాన్‌ను రద్దు చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# ఆస్ట్రేలియా గడ్డ మీద చరిత్ర సృష్టించిన కేశవ్ మహరాజ్




ఆస్ట్రేలియాతో తొలి వన్డే సందర్భంగా సౌతాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మార్నస్ లబుషేన్ రూపంలో తొలి వికెట్ అందుకుని.. సౌతాఫ్రికా తరఫున 300 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కైర్న్స్ వేదికగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లతో చెలరేగి.. ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. లబుషేన్ (1)తో పాటు.. కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను అవుట్ చేశాడు.

**సరికొత్త చరిత్ర**

ఇక ఎడంచేతి వాటం స్పిన్నర్ అయిన కేశవ్ మహరాజ్ (5/33) తన వన్డే కెరీర్‌లో ఈ మేర తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఈ క్రమంలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా గడ్డ మీద ఈ ఘనత సాధించిన సౌతాఫ్రికా తొలి స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్ చరిత్రపుటల్లో తన పేరు లిఖించుకున్నాడు.

**దిగ్గజాల సరసన**

కాగా అంతకుముందు పేసర్లు మఖయా ఎంతిని (6), లుంగి ఎంగిడి (6).. లాన్స్ క్లుసేనర్, షాన్ పొలాక్, మార్కో యాన్సెన్, మోర్నీ మోర్కెల్, నిక్కీ బోజే, రిచర్డ్ స్నెల్ తదితరులు ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫీట్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టీ20 సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు వన్డే సిరీస్‌లో గెలుపు బోణీ కొట్టిన విషయం తెలిసిందే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 98 పరుగుల తేడాతో గెలిచి 1%-%0తో ముందంజ వేసింది. కేశవ్ మహరాజ్ దక్షిణాఫ్రికా విజయంలో కీలకపాత్ర పోషించి.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు.

**ప్రతీకారం తీర్చుకున్న సౌతాఫ్రికా**


కాగా.. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం కంగారూ, సఫారీ జట్ల మధ్య ఇదే తొలి వన్డే కాగా... ఆ మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా జట్టు... ఇప్పుడు విజయంతో బదులు తీర్చుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఈ క్రమంలో తాజాగా మంగళవారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82బీ 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65బీ 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57బీ 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. రికెల్టన్ (33బీ 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.

**కుదేలైన ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్**

అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. 40.5 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88బీ 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), ఆరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27బీ 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్.. ఏడో వికెట్‌కు డ్వార్షుయ్ (52 బంతుల్లో 33బీ 3 ఫోర్లు)తో కలిసి 71 పరుగులు జోడించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేశవ్ మహరాజ్ (5/33) మాయాజాలానికి ఆసీస్ టాపార్డర్ పెవిలియన్‌కు వరుస కట్టింది. వన్డేల్లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన కేశవ్ వరుసగా... లబుషేన్, గ్రీన్, ఇన్‌గ్లిస్, కేరీ, హార్డీ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఒక దశలో 60/0తో పటిష్ట స్థితిలో ఉన్న ఆసీస్ జట్టు... 29 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి 89/6తో నిలిచింది. మార్ష్ పోరాడినా ఫలితం లేకపోయింది.

## హంద్రీనీవా పనులను పరిశీలించిన కలెక్టర్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 20:**





కుప్పం నియోజకవర్గంలోని పరమ సముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా పనులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. కుప్పం పరిధిలోని 430 చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపనున్నట్లు తెలిపారు. చెరువుల సామర్థ్యం పెంపు, చెక్‌డ్యామ్‌లు మర మ్మతులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లకు ఆదేశించారు. త్వరలో ముఖ్యమం త్రి పర్యటనలో పరమ సముద్రం చెరువు వద్ద బహిరంగ సభ, జలహారతి, పైలాన్ ఆవిష్క రణ కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన కేశవ్ మహారాజ్




ఐసీసీ ఇవాళ (ఆగస్ట్ 20) ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో ఓ ప్రధాన మార్పు చోటు చేసుకుంది. బౌలర్ల విభాగంలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. నిన్న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో సంచలన ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మహారాజ్.. రెండు స్థానాలు మెరుగుపర్చుకుని అగ్రస్థానానికి చేరాడు. ఈ క్రమంలో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ, టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌ను రెండు, మూడు స్థానాలకు నెట్టాడు. టీమిండియా నుంచి కుల్దీప్‌తో పాటు రవీంద్ర జడేజా టాప్-10లో(తొమ్మిదో స్థానం) ఉన్నాడు. భారత పేస్ త్రయం షమీ, బుమ్రా, సిరాజ్ వరుసగా 13, 14, 15 స్థానాల్లో ఉన్నారు. బ్యాటర్ల విభాగంలో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ స్థానంలో కొనసాగుతుండగా.. బాబర్ ఆజమ్, డారిల్ మిచెల్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత్ నుంచి గిల్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ (6) టాప్ 10లో ఉన్నాడు. ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పేర్లు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. గత వారం ర్యాంకింగ్స్‌లో రోహిత్ రెండు.. విరాట్ నాలుగు స్థానాల్లో ఉన్నారు. ఆకస్మికంగా వారి పేర్లు ర్యాంకింగ్స్ నుంచి మాయమైపోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఆల్‌రౌండర్ల విభాగానికొస్తే.. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మొహమ్మద్ నబీ టాప్-2లో కొనసాగుతుం డగా.. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్ 10లో (పదో స్థానం) ఉన్నాడు.

**మహారాజ్ మాయాజాలం**

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో నిన్న జరిగిన తొలి వన్డేలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అద్భుతమైన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. 297 పరుగుల భారీ లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకునే క్రమంలో 5 వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఫలితంగా ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆస్ట్రేలియాను 98 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ ప్రదర్శనతో మహారాజ్ పలు రికార్డులను కొల్లగొట్టాడు. తాజాగా ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన్ని దక్కించుకున్నాడు.

## కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 20:**




కుప్పం ఏరియా హాస్పిటల్‌లో రాష్ట్రంలోతొలి డిజిటల్ నర్వ్ సెంటర్ పనితీరును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గు తుందని తెలిపారు. 13 పీహెచ్‌సీలు, 92 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఈ కేంద్రంతో అనుసంధానమయ్యాయని చెప్పారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143